

# నేటి నిజం

తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | ఆదివారం 1-11-2020 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:77 | పేజీలు: 4 | వెల: రూ.1/-

# రైతులు ఆర్థికంగా ఎదిగితేనే బంగారు తెలంగాణ

జనగామ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): రైతులను సంఘటితం చేసి, వారిని ఆర్థికంగా ఎదిగేలా చేయడమే బంగారు తెలంగాణ అని, ఆ కల నెరవేరే వరకు విశ్రమించనని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. వారంతా పంటలు పండించి మద్దతు ధరలకు అమ్ముకుని లబ్ది పొందాలన్నదే తన అభిమతన్నారు. రైతులు సొంతంగా పెట్టుబడి పెట్టుకోగలిగే స్థాయికి ఎదిగిన నాడే బంగారు తెలంగాణ అన్నారు. జనగామ జిల్లా కొడకండ్లలో రైతు వేదికను ప్రారంభించిన అనంతరం అక్కడి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఎం కేసీఆర్ ప్రసంగించారు. రైతు వేదికను ప్రారంభించడంతో ఈ రోజు నాకు సంతోషంగా ఉందన్నారు. మేడ్చల్‌లో కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాం. కొడకండ్లలో మరో చరిత్రకు శ్రీకారం చుట్టాం. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా రైతు వేదికలను తెలంగాణలో ఏర్పాటు చేశాం. ప్రపంచంలో కూడా రైతు వేదికలు లేవని అన్నారు. రైతు వేదిక నా గొప్ప కల.. రైతాంగం ఒకచోట కూర్చొని మాట్లాడుకోవాలి. నియంత్రిత సాగుపై మాట్లాడినట్లే చర్చ చేయాలి. రైతు వేదిక ఒక ఆటం బాంబు, ఒక శక్తి అని కెసిఆర్ పేర్కొన్నారు. రైతులందరూ సంఘటితంగా మారాలి. రైతు వేదికలు నిజమైన రైతు వేదికలు కావాలి. రైతులందరూ వేదికల్లో కూర్చొని ఏ పంట వేయాలని నిర్ణయించాలి. మద్దతు ధరను కూడా నిర్ణయించాలి అని సీఎం కేసీఆర్ అన్నారు. అమెరికా, యూరప్ దేశాల్లో కూడా రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్నే ఉంటారు. టన్నుల కొద్ది టమాటాలు, ఆలుగడ్డలు పడేస్తూనే ఉంటారు. రైతు పెద్దవాడు అనేది వినడానికి బాగానే ఉంది. రైతులు కూర్చోవడానికి వేదికలు లేవు. ఆగమాగం ఉంది. ఇతర దేశాల్లో రైతులకు ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయి. రైతులకు సబ్సిడీలు ఇస్తామంటే కేంద్రం ఇవ్వద్దని అంక్షలు పెడుతుంది. వరి ధాన్యానికి రూ.1888కి కొనాలి. అంతకంటే ఎక్కువ పెట్టి కొంటే ధాన్యమే తీసుకోం అని ఎఫ్‌సీఐ ఆర్డర్ చేసింది. సన్న వడ్లకు ఎక్కువ ధర చెబుదామంటే చెప్పలేని పరిస్థితి. ఇది దేశంలోని రైతుల మీద ఉన్న ప్రేమ. ఇది అప్రజాస్వామిక విషయం కాదా? ఈ విషయాన్ని రైతులందరూ గమనించాలి. వీటన్నింటిని అధిగమించేందుకు ఆలోచించాలి. కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలి. తాము లేని మీరు ఎక్కడ ఉన్నది అని వార్నింగ్ పంపించాలి అని సీఎం కేసీఆర్ అన్నారు. ఈ వేదికలు రైతులను సంఘటిత శక్తిగా మారుస్తాయి. త్వరలోనే భూ సమగ్ర సర్వే జరుగుతుంది. ప్రత్యేక అధికారుల్ని నియమించి రైతులకు సంకల్పం గట్టిగా ఉంటే రైతు రాజ్యం వచ్చి తీరుతుందని అన్నారు. తెలంగాణ కల సాకారం చేశాం. 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. రైతుబంధు ఇస్తున్నాం..ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నాం. జల సంకల్ప బలంతో ముందుకు సాగుతున్నామని, రైతు వేదిక ద్వారా కూడా రైతులను సంఘటితం చేస్తామని అన్నారు. తెలంగాణ రైతులు దేశంలో అగ్రగామిగా నిలవాలి. రైతులంతా వాస్తవాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ధాన్యం కొనుగోలు చేయట్లేదు. ధాన్యం కొనుగోలు చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని సిఎం అన్నారు. గ్రామాల్లోనే ధాన్యం కొను గోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. త్వరలో కరోనా సెకండ్ వేవ్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కరోనా పీడ ఇంకా పోలేదు.. జాగ్రత్తగా ఉండాలి. రైతు వేదిక ఒక ఆటం బాంబ్.. అద్భుతమైన శక్తి. ఏ పంట వస్తే లాభమో రైతు వేదికలే నిర్ణయించాలి. ప్రత్యేక అధికారుల్ని నియమించి రైతులకు సూచనలిస్తాం. 95శాతం రైతు వేదికలు పూర్తయ్యాయి' అని కేసీఆర్ వెల్లడించారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చే ఏకైక రాష్ట్రం మనది. నేను బతికి ఉండగా రైతుబంధు ఆగదు. వీఆర్వో వ్యవస్థను రద్దు చేశాం.. వారిపై నాకు వ్యక్తిగత కోపంలేదు. రైతులకు భూమి విషయంలో సంపూర్ణ రక్షణ రావాలి. అనుభవదారు ముచ్చట్లే ఉంటే భూమిపై హక్కులు పట్టాదారు వస్తాయి. కౌలుకు ఇవ్వదలు అంటే కిరాయికి ఇవ్వడమే. నిజాం రాజుల తర్వాత ఎవరూ భూసర్వే చేయలేదు. తెలంగాణలో రైతు రాజ్యం వచ్చి తీరుతుంది' అని కేసీఆర్ తెలిపారు. జనగామ జిల్లా కొడకండ్లలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రైతు వేదికను ప్రారంభించారు. దేశచరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారు.

**సొంతంగా పెట్టుబడి పెట్టేస్థాయికి వారు ఎదగాలి**
**వారంతా సంఘటితం కావడానికే వేదికల నిర్మాణం**
**ఏ పంట వేయాలి..ఎక్కడ అమ్మాలన్న చర్చలు జరగాలి**
**రైతులకు గతంలో ఉన్న సమస్యలు లేకుండా చేశాం**
**రైతు వేదికలతో మరో చరిత్ర సృష్టించాం**
**కొడకండ్లలో రైతువేదిక ప్రారంభించి ప్రసంగించిన సిఎం కెసిఆర్**

రైతు వేదిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మంత్రులు నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అంతకుముందు కొడకండ్లకు చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజాప్రతి నిధులు ఘన స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. అర్చకుల మంత్రోచ్ఛరణాల మధ్య రైతు వేదిక శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. రైతులు పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టి సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలిపారు.



రైతు వేదిక అందుబాటులోకి రావడంతో రైతులందరూ సంతోషం వ్యక్తం చేశారు. రైతులు సాగు సమస్యలపై చర్చించడం, అధిక దిగుబడులు, సస్యరక్షణ కోసం అవలంబించాల్సిన అధునాతన పద్ధతులపై అవగాహన పెంచుకొనేందుకు నిర్మించిన రైతు వేదికలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 350 కోట్ల వ్యయంతో 2,601 రైతు వేదికలు నిర్మిస్తున్నారు. ఇందులో 2,462 గ్రామీణ ప్రాంతాల్లో, 139 పట్టణాల్లో ఉన్నాయి. ఒక్కో రైతు వేదికను 2,046 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ. 22 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు 1,951 రైతు వేదికల నిర్మాణం పూర్తికాగా, 650 నిర్మాణ దశలో ఉన్నాయి. వక్షం రోజుల్లో వీటన్నింటినీ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇప్పటికే ఆదేశించారు. ఇందులో భూవిరాళంతో నిర్మిస్తున్న రైతు వేదికలు 139 ఉన్నాయి. రైతు వేదికలో రెండు గదులు, మరుగుదొడ్లు, విశాలమైన హాలు నిర్మిచడంతోపాటు మిషన్ భగీరథ ద్వారా నల్లా కనెక్షన్ ఇచ్చారు. ప్రతి వేదికకూ విద్యుత్తు సదుపాయం కల్పించారు.

## మళ్లీ మక్కలు వేసి నష్టపోవద్దు

### సన్నాలు వేసిన వారిని కూడా ఆదుకుంటాం

### కొండకండ్ల సదస్సులో -సిఎం కెసిఆర్ వెల్లడి

జనగామ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): తెలంగాణ రైతన్నలు మక్క పంట వేయొద్దని ఇదివరకే పలుమార్లు చెప్పిన సీఎం కేసీఆర్.. జనగామ వేదికగా మరోసారి ఇదే విషయాన్ని గుర్తు చేశారు. కొడకండ్లలో రైతు వేదికలను కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఈసారికి ప్రభుత్వానికి నష్టమైనా మక్కలు కొన్నామని తెలిపారు. ఇక ముందు మక్కలు వేయొద్దు.. పంట వేసినా దాన్ని ప్రభుత్వం కొనదు అని కేసీఆర్ తేల్చిచెప్పారు. మార్కెట్ ఉండే పంటలను మాత్రమే రైతులు సాగు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రపంచంలో ఎక్కడా రైతులకు వేదికలు లేవని.. ఇది తన కల అని ఆయన చెప్పుకొచ్చారు. సన్నాలు పండించిన రైతులను కూడా ఆదుకుంటామని అన్నారు. వారికి ఎలా దరలు రావాలో ఆలోచించి చెబుతామని అన్నారు. రైతులు డిమాండ్ ఉన్న పంటలను పండించాలన్నదే తన కోరికని అన్నారు. రైతువేదికల్లో పంటలపై చర్చ చేయాలన్నారు. అమెరికా, యూరప్‌లో కూడా రైతులు నిరసనలు తెలియజేస్తూనే ఉంటారని అన్నారు. ఇప్పటి వరకు రైతులకు ఒక వ్యవస్థ అంటూ లేదన్నారు. ఈ వేదికలు రైతులను సంఘటిత శక్తిగా మారుస్తాయన్నారు. 'తెలంగాణలో రైతు రాజ్యం వచ్చి తీరుతుంది. కరోనా కాలంలో వ్యవసాయం ఆగొద్దని ప్రధాని మోదీకి చెప్పాను. సమైక్యరాష్ట్రంలో రైతుల్ని ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. 75శాతం సబ్సిడీతో గొర్రెలను పంపిణీ చేశాం. కరోనా కారణంగా రాష్ట్రం రూ.50 వేల కోట్లు నష్టపోయింది. ప్రతిపక్షాలకు ఓటు తప్ప ఇంకేం కనిపించడం లేదని సీఎం కేసీఆర్ వెల్లడించారు. కానీ ఓట్లతో సంబంధం లేకుండా అనేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు.

# గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం

### కేంద్ర వ్యవసాయ చట్టంతో రైతుల ఆగం
### ధరలు పెట్టి కొనే వ్యవస్థ నాశనం
### కేంద్రం తీరుపై మండిపడ్డ సిఎం కెసిఆర్

జనగామ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని,. రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ మాత్రమే అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. కేంద్రం తీసుకుని వచ్చిన వ్యవసాయ చట్టంతో ఆ అవకాశం కూడా లేకుండా చేవారని మండిపడ్డారు. జనగామ జిల్లాలోని కొడకండ్లలో రైతు వేదికను ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేసీఆర్ ప్రసంగించారు. వ్యవసాయ చట్టంతో రైతులు బాగుపడడం మాటెలా ఉన్నా వ్యాపారులు బాగు పడతారన్నారు. ధాన్యం తీసుకుని ఇతర ప్రాంతాలకు పోయి అమ్ముకునే అవకాశం ఉంటుందా అని ప్రశ్నించారు. ధాన్యానికి మంచి ధర ఇద్దామంటే మెడ మీద కత్తి పెడుతున్నారు. ఈ రకమైన చిక్కుల్లో మనం ఉన్నాం. రైతుల బాధలు, ఆత్మహత్యలను కళ్లారా చూశాను. వాటిని చూసి బాధపడ్డాను. సీఎం అయిన తర్వాత కఠిన నిర్ణయాలు తీసుకున్నా. తెలంగాణ రైతాంగం భారతదేశంలోనే అగ్రగామిగా ఉండాలని ప్రతిజ్ఞ తీసుకున్నాం. ఇది టెక్నాలజీ యుగం. అందరి వద్ద స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ ఉంది. దీంతో ప్రజలందరూ వాస్తవాలు తెలుసుకోవాలి. రైతులు చర్చ చేయాలన్నారు. రైతులు తమ పంటలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడానికే వేదికను నిర్మించామని అన్నారు. రైతులు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కరోనా మహమ్మారి పీడ ఇంకా ఉంది. జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. సెకండ్ వేవ్ కరోనా వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రైతు లోకానికి దండం పెట్టి చెబుతున్నాను. ఈ వేదికలో ప్రపంచంలో, దేశంలో ఎక్కడా లేవు. కడకొండ్లలో రైతు వేదిక ప్రారంభించడం సంతోషంగా ఉంది. రాజ్యం గెలిచినంతా సంతోషమైంది. కేబినెట్ సమావేశాల్లో చర్చలు జరిపి.. రైతు వేదికలు నిర్మించాలని సంకల్పించాం. ఎన్ని వందల కోట్లు అయినా సరే ఖర్చు పెట్టి రైతు వేదికలను నిర్మాణం చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా 2601 రైతు వేదికలు నిర్మిస్తున్నాం. మరో వారం రోజుల్లో అన్ని వేదికలు పూర్తవుతాయి. దాదాపుగా 600 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. గొప్ప ఉద్దేశంతో, అవగాహనతో ఈ వేదికలను నిర్మించామన్నారు. రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ శాఖలో ప్రబలమైన మార్పులు తీసుకువస్తున్నాం. ఒక ఐఏఎస్ ఆఫీసర్‌ను నియమించి పంటల విధానంపై చర్చ చేస్తారు. మార్కెటింగ్ పరంగా సూచనలు చేస్తారు. ప్రతి రైతుకు సమాచారం అందేలా అధికారులు పని చేస్తారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులు రైతులకు పాఠాలు చెప్పి.. మెలకువలు, సూచనలు చెబుతారు. ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తాం. దీంతో రైతులు తప్పకుండా బంగారం పండిస్తారు. రైతు వేదికల్లో టీవీలు ఏర్పాటు చేస్తారు అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో రైతు రాజ్యమే సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్, రైతు వేదికలు, రైతుబంధు, రైతుబీమా ఉట్టిగా పెట్టలేదు. రైతులందరూ సంఘటితం కావాలనే ఉద్దేశంతోనే వీటన్నింటిని చేపట్టాం. రైతులు ఎవరికీ వారే ఉంటే ఆగమాగం అవుతాం. సంఘటితంగా ఉన్నప్పుడే ఫలితాలు సాధ్యమవుతాయి. లాభసాటి వ్యవసాయం చేయాలి. కూరగాయాలు, ధాన్యం ధరలు దళారీల చేతుల్లోకి పోవద్దు. ఇవన్నీ తొలగిపోవాలంటే రైతు వేదికలే కీలక పాత్ర పోషిస్తాయి. రైతు వేదికలు దేశానికి ఆదర్శంగా నిలవబోతున్నాయి. సంకల్పం, చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే ఏదైనా సాధించొచ్చు. తెలంగాణలో రైతు రాజ్యం వచ్చి తీరుతది. రాష్ట్ర రైతుబంధు కమిటీ ధర నిర్ణయించిన తర్వాత మార్కెట్లోకి వెళ్లాలి. అప్పుడే గొప్పగా రైతులకు గిట్టుబాటు ధరలు వస్తాయి. తెలంగాణ రైతాంగమంతా కొన్ని విషయాలను సీరియస్‌గా తీసుకోవాలి. నేను సీఎం అయ్యేనాటికి వ్యవసాయ శాఖను చంపేశారు. కానీ ఇప్పుడు వ్యవసాయ శాఖలో అన్ని పోస్టులు భర్తీ చేశాం. వ్యవసాయ శాఖ అద్భుతంగా పని చేస్తుందన్నారు. రైతులు పిడికిలి బిగించి సంఘటితం అయితేనే మంచిదన్నారు. రైతు వేదికలు యాక్టివ్‌గా ఉండేలా రైతు బంధు కమిటీలు నాయకత్వం వహించాలి. ఇది గొప్ప నిర్ణయం. 50 నుంచి 60 శాతం మంది ప్రజలకు ఈ వేదికలు బతుకుదెరువు. ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ పెడితే సస్పష్టంగా చెప్పాను. ఏది ఏమైనా సరే.. మన దేశం యొక్క పరిస్థితి ఏవి నిలుపుదల చేసినా, వ్యవసాయం ఆపకూడదని చెప్పాను. ప్రపంచంలో 200 పైచిలుకు దేశాలున్నాయి. తెలంగాణ రాష్ట్రం కంటే చిన్నగా 180 దేశాలు ఉన్నాయి. ఎట్టి పరిస్థితుల్లో ఆహార రంగంలో స్వయం శక్తి ఉండాలని సూచించాను. చాలా సీఎంలు నిజమని చెప్పారు. అన్నం పెట్టే శక్తి ప్రపంచంలో ఎవరికీ లేదు. ఎప్పుడు పరిస్థితులు ఒకేలా ఉండవు. అన్నం పెట్టే శక్తి కేవలం తెలంగాణకు మాత్రమే ఉందన్నారు. మ్మడి ఏపీలో రైతులను ఎవరూ పట్టించుకోలేదు. ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేయలేదు. కానీ కాలం మారింది. తెలంగాణ రాష్ట్రంలో రైతులు నిమ్మలం అయ్యారు. ఇంకా కావాలి. రైతులు బాగుండాలి. కిరికిరి గాళ్లు ఎప్పటికీ ఉంటరు. గ్రామాలు మంచిగా ఉండాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. కులవృత్తులను బలోపేతం చేయాలి. ఇండియా మొత్తంలో ఎక్కడా లేని విధంగా గొర్రెల పెంపకం దారులకు 75 శాతం సబ్సిడీ ఇచ్చాం అని సీఎం కేసీఆర్ తెలిపారు.

ఇవ్వని వారికి కూడా ఇస్తామన్నారు. ఇలా గొ÷-రెలు ఇవ్వాలని ఎవరూ అడగలేదన్నారు. ఏ పథకం కోసం కూడా ఎవరూ అడగలేదన్నారు. తాను నమ్మి ఈ పథకాలు అమలు చేస్తున్నానని అన్నారు.

# ఉగ్రవాదంపై భారత్ నిరంతర పోరు

### సైనికుల త్యాగాలను తక్కువ చేయొద్దు
### పుల్వామా దాడి ఘటనపై పాక్ తీరును దుయ్యబట్టిన ప్రధాని
### జాతీయ ఏక్తా దివస్ సందర్భంగా ఉక్కుమనిషి పటేల్‌కు నివాళి

గాంధీనగర్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): ఉగ్రవాదంపై భారత్ నిరంతర పోరు సాగిస్తుందని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ ఏకమై పోరాడాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ఉగ్రవాదం,



హింసతో ఏ ఒక్కరూ ప్రయోజనం పొందలేరని పరోక్షంగా పాక్‌కు చురకలంటించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికుల త్యాగాలను దేశం ఎప్పటికీ మరువదని పేర్కొన్నారు. పుల్వామా దాడి సమయంలో కొందరు సైనికుల వక్షాన నిలవకపోవడం బాధించిందని, దేశ ప్రయోజనాల కోసం ఇలాంటి రాజకీయాలు మరోసారి చేయవద్దని ఆయన అభ్యర్థించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభా భాయ్ పటేల్ జయంతిని పురస్కరించు కొని ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ లోని యూనిటీ ఆఫ్ స్టాచ్యూ వద్ద నివాళులర్పించారు. 'రాష్ట్రీయ ఏకతా దివస్' ను పురస్కరించుకొని జరిగిన పోలీస్ పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. కరోనా సంక్షోభ వేళ దేశం మొత్తం ఐక్యంగా ఆ మహమ్మారితో పోరాడిందని.. అలాగే సర్దార్ పటేల్ కూడా దేశ ఐక్యత కోసం పోరాడారని మోదీ అన్నారు. కరోనా ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ప్రభావాన్ని చూపిందని, దేశ పురోగతిని కూడా ప్రభావితం చేసిందన్నారు. అయితే ఇంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా దేశం తన సామాజిక బలాన్ని, శక్తిని ప్రదర్శించడం చూస్తుంటే చాలా ఆశ్చర్యకరంగా ఉందని ఆయన అన్నారు. 130 కోట్ల మంది భారతీయులు కోవిడ్ వారియర్స్‌కు సత్కారాలు, గౌరవాలు అందించారని, అంతటి క్లిష్ట సమయంలో కూడా దేశం ఐక్యంగా తన శక్తిని చాటిందని పేర్కొన్నారు. సోమనాథ క్షేత్ర పునర్నిర్మాణ ప‌క్రియ ద్వారా దేశ సాంస్కృతిక గౌరవాన్ని తిరిగి తీసుకురావడానికి పటేల్ ఓ పెద్ద యజ్ఞాన్నే చేశారని, దానికి కొనసాగింపే రామ మందిర నిర్మాణమని అన్నారు. భవ్య రామ మందిర నిర్మాణాన్ని ఈ రోజు మనం చూస్తున్నామని అన్నారు. నర్మదా నది తీరంలోని కేవాడియా వద్ద ఐక్యతకు చిహ్నంగా నిర్మించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్ అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో శాంతిని పునరుద్ధరించి, అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పర్యాటక రంగంలో అనేక కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయని, దేశంలోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకానికి కొత్త రూపు తీసుకొచ్చేందుకు కృషిచేస్తామని ఆయన పేర్కొన్నారు. దేశం కరోనాపై విజయసాధించేందుకు కృషిచేసిన పోలీసులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితర కరోనా యోధులకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

# భారత్‌లో ఆగని కరోనా కేసులు

### 48,268 కరోనా కేసులు నమోదు

న్యూఢిల్లీ,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతూనే ఉంది. నిత్యం 40 వేలకు పైగా పాజిటివ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. గడిచిన 24 గంటల్లో 48,268 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 81,37,119కు చేరింది. నిన్న ఒక్క రోజే 551 మంది మరణించగా ఇప్పటివరకు మొత్తం 1,21,641 మంది కరోనాతో మృత్యువాతపడ్డారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. దేశంలో కొత్తగా 48,268 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కరోనా కేసుల సంఖ్య 81,37,119కి చేరాయి. ఇందులో 5,82,649 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇది శుక్రవరాం కంటే 11,737 తక్కువ. అదేవిధంగా కరోనా భారినపడివారిలో 74,32,829 మంది కోలుకున్నారు. గత 24 గంటల్లో కొత్తగా 59,454 మంది కరోనా మహమ్మారి నుంచి బయట పడ్డారు. కాగా, కరోనా వల్ల నిన్న ఉదయం నుంచి ఈరోజు ఉదయం వరకు 551 మంది మరణించారు. దీంతో మొత్తం కరోనా మృతుల సంఖ్య 1,21,641కి చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రకటించింది. కరోనా రికవరీరేటు 91 శాతానికి చేరిందని తెలిపింది. 59,454 మంది కోలుకుని ఆసుపత్రులనుంచి డిశ్చార్జ్ కాగా ఇప్పటి వరకు మొత్తం 74,32,829 మంది కోలుకున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య 5,82,649గా ఉంది. దేశంలో కరోనా రోగుల రికవరీ రేటు 91.34 శాతంగానూ.. నమోదయిన మొత్తం కేసులలో యాక్టివ్ కేసుల శాతం 7.16 శాతంగా ఉంది. మరణాల రేటు 1.49 శాతానికి తగ్గింది.

#### తెలంగాణలో తగ్గుముఖం

తెలంగాణ రాష్ట్రంలో నిన్న రాత్రి 8గంటల వరకు నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల్లో కొత్తగా 1,445 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 2,38,632కి చేరింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ శనివారం ఉదయం బులిటెన్ విడుదల చేసింది. శుక్రవారం ఒక్కరోజే కరోనాతో ఆరుగురు మంది మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 1,336కి చేరింది. కరోనాబారి నిన్న ఒక్క రోజే 1,486 మంది కోలుకున్నారు. దీంతో ఇప్పటివరకు కోలుకున్న బాధితుల సంఖ్య 2,18,887 చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 18,409 యాక్టివ్ కేసులు ఉన్నాయని, వారిలో 15,439 మంది హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.

## చరిత్రలో నేటినిజం



కం॥ మామిడి గుబురులందుండున
కోవెలల సమీపమందు కోయిలయగుచున్
"దేవులపల్లి" కులంబున
భావుకుడగు "కృష్ణశాస్త్రి" పాడెను కవితన్॥

( నవంబర్ 1 దేవులపల్లి కృష్ణశాస్త్రి జననం..)



-రాధశ్రీ
సెల్: 9494481210

# వరంగల్ అధికారులకు మంత్రి కెటిఆర్ ప్రశంసలు

### నాలాల ఆక్రమణల తొలగింపు చర్యలకు అభినందన

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): వరంగల్ అర్బన్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. వరంగల్ పట్టణంలో నాలాలు, డ్రైన్లకు ఉన్న అడ్డంకులు తొలగించేందుకు బాగా పని చేశారని కొనియాడారు. హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాల్లోనూ ఇదే వ్యూహాన్ని అనుసరించాలని కేటీఆర్ ట్వీట్ చేశారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ అర్బన్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పలు కాలనీలు నీట మునిగిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నాడు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ పట్టణాన్ని పరిశీలించారు. నాలాలు, డ్రైన్లపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్‌ను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు

అధికారులు చర్యలు చేపట్టారు. వరంగల్ పట్టణంలో మొత్తం 384 అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వీటిలో 288 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. మరో 96 నిర్మాణాలు కోర్టు స్టేతో పెండింగ్‌లో ఉన్నాయి.

# ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

### ఫిర్యాదుల కొరకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

హైదరాబాద్,అక్టోబర్31(ఆర్ఎన్ఎ): తెలంగాణలో వానాకాలం సీజన్‌లో పండిన వరి ధాన్యాన్ని కొనుగోలుచేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లుపూర్తిచేసింది. ఈసారి వానాకాలంలో రైతుల నుంచి భారీగా ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికోసం పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు కలిగే ఇబ్బందులు, సమస్యలపై ఫిర్యాదుచేసేందుకు 1967 నెంబర్‌తో పాటు, 180042500333, 18004254614 టోల్ ఫ్రీ నెంబర్‌లను కూడా ఏర్పాటు చేసింది. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ ఫిర్యాదులను స్వీకరిస్తారు. ధాన్యం విక్రయంలో ఏదైనా సమస్యలుంటే రైతులు నేరగా ఈ నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు.

